



"ఉగాది రోజు కూడా వుద్యోగానికి వెళ్ళాలా? ఇవాళ మీకు శెలవు కాదే?" అడిగింది రేడియో స్టేషన్‌కి బయలుదేరిన సత్యవాదిని అతని మరదలు.

"అందరిలా అయనకి పండగ పబ్బం అంటూ ఉండదు. ఆయన వుద్యోగమే అంత" చెప్పింది సత్యవాది భార్య పండగకి వచ్చిన చెల్లెలితో.

"మూడు వందల అరవై నాలుగురోజులూ రేడియో వింటంలేదా నువ్వు? ఆదివారాలు, ఇతర శెలవదినాల్లో రేడియోస్టేషన్ కట్టేసి, కార్యక్రమాలు ప్రసారం కాకపోతే తెలుస్తుంది" చెప్పాడు సత్యవాది చిరునవ్వు నవ్వి.

"దిన పత్రికలకుండే శెలవు మీకెందుకు వుండకూడదు?" అడిగింది సత్యవాది భార్య ఆమెకి భర్త వుద్యోగం మీద అసంతృప్తి, చిరాకు.

"ఇవాళ త్వరగా వచ్చేస్తాను" చెప్పాడు సత్యవాది.

"షిఫ్టు సిస్టంకదా? మరి ప్రతీ పండగకి మీరే పనిచేస్తారే?" అడిగింది సత్యవాది భార్య.

"వినాయక చవితికి షిఫ్టు రాకుండా జాగ్రత్త పడతాను. ఇవాళ డ్యూటీ చేయాల్సినతనికి కొత్తగా పెళ్ళవడంతో అత్తవారింటికి చెక్కేసాడు, అతను కోరితే కాదనలేకపోయాను."

సత్యవాది రేడియో స్టేషన్‌కి స్కూటర్ మీద బయలుదేరాడు. అల వాటుగా దారిలో ఆ బాదంచెట్టు ఇంటిముందు స్కూటర్ వేగం తగ్గించాడు.

రోజూ రేడియో స్టేషన్‌కి వెళతూ తిరిగి ఇంటికి వస్తూ ఆ ఇంటి వైపు చూడటం సత్యవాది దినచర్యలో ఓ భాగం.

సత్యవాది స్నేహితుడు సుందరరావు అద్దెకుండే ఇల్లది. అతను హైదరాబాద్‌కి కొన్ని మైళ్ళ దూరంలో వున్న ఓ ప్రభుత్వం ఇంజనీరింగ్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

వాళ్ళది ముచ్చటయిన సంసారం. సుందరరావు భార్యకి నలభై కి రెండు మూడేళ్ళ తక్కువుంటాయి. ఓ కొడుకు, ఓ కూతురు. ఆవిడ హాబీకి నిదర్శనగా గేటులోంచి ఇంటిముందు కనపడే చిన్నతోట.

పది, పదిహేను రోజులకోసారి వాళ్ళింటికి వెళ్తుంటాడు సత్యవాది. చదరంగం ఆటంటే ఇద్దరికీ మంచి అభిరుచి. ఇద్దరికీ షిఫ్టులుండే వుద్యోగం కాబట్టి ఇద్దరికీ ఒకేసారి తీరిక సమయం దొంకడం కష్టం. అలా దొరికినప్పు డల్లా మల్లె పందిరి కింద కుర్చీలు వేసుకుని కూర్చుని చదరంగం ఆడతారు గంటల తరబడి.

చాలా చక్కటి సంసారం వాళ్ళది సత్యవాది దృష్టిలో. ఆవిడ పిల్ల లని కోప్పటం ఒక్కసారి కూడా సత్యవాది కంటపడలేదు. మిగతా స్నేహి తుల పిల్లలలాగా సుందరరావు కొడుకు స్కూటర్ మీదకి ఎగబడడు.

"అంకుల్ ఓసారి ఎక్కించవా?" అని అడగడు.

ఆవిడ క్రమశిక్షణని మనసులోనేకాక బహిరంగంగా అనేకసార్లు మెచ్చుకున్నాడు.

"నా భార్య నా అదృష్టమోయ్" అంటాడు సుందరరావు నవ్వి.

ఆ వాతావరణం, ఆ ప్రాంగణం ఎంతో హాయిగా, ప్రశాంతంగా వుంటాయి సత్యవాదికి.

సత్యవాది స్కూటర్ వేగం తగ్గించి చూసాడు. సుందర్రావు కొడుకు గేటు పక్కన వున్న వేపచెట్టు మీదకి ఎక్కి వేప పువ్వులు కొసి కిందపడే స్తున్నాడు. అతని చెల్లెలు వాటిని ప్లాస్టిక్ బుట్టలోకి ఏరుతోంది. అప్పుడే

ఉదయిస్తున్న సూర్యుని లేత కిరణాలలో తలంటి పోసుకున్న మిసెస్ సుందరరావు తల నీలాలని ఆరబెట్టుకుంటోంది.

ఆవిడని చూసి స్కూటర్ గేర్ మార్చి న్యూట్రల్ చేసాడు.

"అంకుల్ హేపీ ఉగాది" చెప్పింది సుందర్రావు కూతురు సత్యవాదిని చూసి.

"థాంక్స్. విష్ యూ ఆల్ హేపీ వుగాది" చెప్పాడు సత్యవాది.

వేపచెట్టు మీదనుంచి సుందర్రావు కొడుకు కూడా అరిచాడు.

"అంకుల్ హేపీ వుగాది."

"రేడియో స్టేషన్‌కా?" అడిగిందావిడ.

"అవునండీ! ఇవాళ మార్నింగ్ షిఫ్టు."

"మీ ఉద్యోగంలో వున్నవాళ్ళకి పండగనేది వుండదు."

"ప్రొడక్షన్ సైడ్‌వుండే స్టాఫ్‌కి తప్పదండీ" చెప్పాడు సత్యవాది.

"అన్నట్లు ఆయన రాంచీ వెళ్ళారు."

"ఎప్పుడు?"

"అయిదురోజులయింది. ట్రెయినింగ్‌కోసం పంపించారు ఆయన దంపెనీవాళ్ళు!"

"అంకుల్! మా డాడీ మరో నెలరోజులదాకా రారు" చెప్పింది సుందర్రావు కూతురు.

"సరే! అయితే పండగకి లేరన్నమాట" అన్నాడు సత్యవాది.

"ఉహూం. ప్రతీసారి వుండేవారు. ఈసారి కుదరలేదు.... అన్నట్లు ఇవాళ మా మేరేజ్ ఏనివర్సరీ కూడా."

"కంగ్రాచ్యులేషన్స్."

"థాంక్స్. ఇంటికివెళుతూ ఓసారిరండి. స్వీట్స్ తీసుకుందురుగాని."

"తప్పకుండా."

"అంకుల్! ఉగాది పచ్చడి కూడా తిందురుగాని" చెట్టుమీదనించి అరిచాడు సుందర్రావు కొడుకు.

"ఇవాళ టెలిగ్రాఫ్ ఆఫీస్ తీసే వుంటుంది కదండీ?" అడిగింది మిసెస్ సుందరరావు.

"అదీ మా వుద్యోగంలాగే. తీసి ఉంటుంది."

"అంకుల్! మొన్న రాత్రి పాటల్లో మా పేరు చెప్పారు. థాంక్స్ అంకుల్" సుందర్రావు కూతురు చెప్పింది గుర్తురావడంతో.

చిన్నగా నవ్వాడు సత్యవాది.

"ఇవాళ కూడా చెప్పించనా? వినండి."

ఆవిడ నవ్వింది.

"వెళ్తానండీ టైం అయింది."

"వస్తారుగా ఇంటికి వెళుతూ?"

తలవూపాడు సత్యవాది. స్కూటర్‌ని పోనిచ్చాడు.

మేరేజ్ ఏనివర్సరీ, ఉగాది కలసి వచ్చాయి వాళ్ళకి. ఈసారి ఏద యినా కానుక లాంటిది తీసుకెళ్ళాలనుకున్నాడు సత్యవాది.

టెలిగ్రాఫ్ ఆఫీస్ గురించి అడిగింది ఆవిడ. బహుశా భర్త దగ్గర నుంచి గ్రీటింగ్ టెలిగ్రాం కోసం ఎదురు చూస్తూండి ఉంటుంది. లేదా తనే పంపుతుందేమో!

రేడియో స్టేషన్ చేరుకునేదాకా సత్యవాది వాళ్ళ గురించే ఆలోచి స్తూండిపోయాడు. అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేసి డ్యూటీ ఆఫీసర్ కుర్చీలో కూర్చున్నాడు.

సిగ్నేచర్ ట్యూన్, తర్వాత అనౌన్సర్ కంఠం, ఆనాటి కార్యక్రమాల గురించి వివరణ.... సత్యవాది డ్యూటీ రూంలోని రేడియో వింటూ తన రొటీన్‌లో పడిపోయాడు.

మధ్యలో ఓసారి ఆ రోజు రాత్రి వివిధ భారతిలో శ్రోతలు కోరిన పాటలు పెట్టే అనౌన్సర్ పేరు రాశాడు డ్రాయర్‌లోంచి కవరు తీసి.

ఓ కాగితం అందుకుని కొన్ని క్షణాలు ఆలోచించి రాశాడు.

'డియర్ ఫ్రెండ్.'

చిన్న పర్సనల్ రిక్వెస్ట్.

ఇవాళ నా స్నేహితుడి మేరేజ్ ఏనివర్సరీ రోజు. మిస్టర్ అండ్ మిసెస్ సుందరరావు, వనజ, రమేశ్ కోరినట్లుగా వాళ్ళ పేర్లు చదివి ఏద యినా మంచి పాట వెయ్యగలరా? ఈ రాత్రి వాళ్ళు రేడియో వింటారు.'

కింద సంతకం చేసి ఆ కాగితాన్ని కవరులో ఉంచి అంటించి లేచాడు. ఎదురుగా ఉన్న వివిధ భారతి డ్యూటీ రూంలోని ఆఫీసర్‌కి ఆ కవరు అందించి చెప్పాడు-

"సాయంత్రం ఇది ఆమెకి అందేలా చూడండి."

సరిగ్గా పదకొండున్నరకి సత్యవాది పేరు మీద పర్టికులర్ పర్సన్ ట్రంకాల్ వచ్చింది.

రాంచీనించి.

"ఈజ్ దట్ మిస్టర్ సత్యవాది?" అడిగింది అడ టెలిఫోన్ ఆప రేటర్ రాంచీ ఎక్స్చేంజీ నుంచి.

"అవును" చెప్పాడు సత్యవాది కొద్దిగా ఆశ్చర్యపడి.

సుందరరావు తనకి దేనికి ఫోన్ చేస్తున్నట్లు?

అవతల ఆపరేటర్ ఓ నంబర్‌ని డయల్ చేసింది. బెల్ మ్రోగిన శబ్దం, ఆపరేటర్, ఆ నెంబరు వాళ్ళు మాట్లాడుకోవడం వినిపించింది.

"పి. పి. ఈజ్ ఆన్ లైన్. స్పీకాన్" చెప్పింది ఆపరేటర్ కాల్ బుక్ చేసిన వాళ్ళతో.

"సత్యవాదిగారేనా?" హిందీలో అడిగారెవరో.

"అవును" చెప్పాడు.

"మీరు సుందరరావు గారి స్నేహితులు కదా?"

"అవును."

"ఐ యామ్ సారీ, మీకో దుర్వార్త చెప్పడానికి చింతిస్తున్నాను. సుందరరావు గారికి ఇక్కడ ప్లేంట్‌లో నిన్న ఉదయం ఏక్సిడెంట్ జరిగింది. నిన్న సాయంత్రం ఆస్పత్రిలో.... ఆస్పత్రితో మరణించారు....."

"గుడ్ గ్రేషియస్....నిజంగా?" సత్యవాది చేతివేళ్ళు టెలిఫోన్ రిసీవర్ చుట్టూ బిగుసుకున్నాయి.

"అవును. ఆస్పత్రికి తీసుకెళ్ళబోయే ముందు ఆయన రేడియో స్టేషన్‌కి ఫోన్ చేసి మీకు చెప్పమని కోరారు. నిన్న ట్రై చేస్తే మీరు ఇవాళ ఉదయం డ్యూటీకి వస్తారని తెలిసింది."

సత్యవాదికి ఏం మాట్లాడాలో తెలియలేదు వెంటనే.

"ఈ వార్త వాళ్ళ కుటుంబ సభ్యులకు తెలియజేయండి."

"శవం?" పెగుల్చుకుని అడిగాడు సత్యవాది.

"రేపు ఉదయం వస్తుంది.... చూడటానికి ఏం మిగలలేదు. క్రేన్ విరగడంతో అయిదారుగురు పిప్పి అయ్యారు. అందులో సుందరరావు ఒకరు."

"ఇంకా?"

"అంతే! అవర్ కండొలెన్సెస్ టు హిజ్ ఫేమిలీ."

రిసీవర్ లోంచి క్లిక్ వినిపించింది అవతల వ్యక్తి డిస్‌కనెక్ట్ చేసినట్లుగా. అయినా సత్యవాది రిసీవర్ క్రెడిల్ మీద వుంచలేదు. ఆ వార్త బుర్రనిండా అలుముకోవడంవల్ల కలిగిన షాక్ నించి ఇంకా తేరుకోలేదు.

"ఏమైంది?"

చెక్స్ రిజిష్టర్ తిరగవేస్తున్న సహోద్యోగి అడిగాడు పాలిపోయిన సత్యవాది మొహాన్ని చూసి.

రిసీవర్ క్రెడిల్‌మీద ఉంచి సత్యవాది చెప్పాడు వణికే గొంతుతో-

"నా స్నేహితుడు పోయాడు........రాంచిలో."

సత్యవాది తప్పదు కాబట్టి కూర్చున్నాడు. తన పనిని అన్యమనస్కంగానే చేసాడు. ఆ తర్వాత తనా వార్త చెప్పగానే సుందరరావు భార్య మొహం ఎలా మారుతుందో తెలుసతనికి.

డ్యూటీ అయ్యాక బయటకు వెళుతూ గుర్తొచ్చి కొన్నిక్షణాలు వివిధ భారతి రూం ముందు ఆగాడు.

కాని లోపలికి వెళ్ళే ప్రయత్నం విరమించుకుని స్కూటర్ వైపు

దారి తీసాడు. స్టార్టు చేసి ఎక్కాడు. మనసంతా వెలితిగా, దిగులుగా, బాధగా వుంది.

ఇక సుందరరావుని చూడలేడు.

తనే కాదు,

ఎవరూ చూడలేరు.

యాంత్రికంగా ఆపాడు స్కూటర్ని సుందరరావు ఇంటి గేటు ముందు స్కూటర్ని లాక్ చేసి, గేటు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు- గుండె వేగంగా కొట్టుకుంటూంటే.

ముందు గదిలో పిల్లలిద్దరూ కొత్త బట్టల్లో చదరంగం ఆడుకుంటు న్నారు. సుందరరావు భార్య లోపలినించి వచ్చింది పిల్లలు పిలవగానే.

"రండి కూర్చోండి, నిలబడ్డారే?"

సత్యవాది కుర్చీలో కూర్చున్నాడు.

"ఒక్క నిమిషం."

ఆవిడ లోపలికి వెళ్ళి కొన్ని నిమిషాల్లో ఓ స్టీల్ కప్పులో ఉగాది పచ్చడి, ఓ ప్లేట్లో తియ్యటి బూంది, బాదుషా, గారెలు తెచ్చింది.

తెల్లటి నుదిటిమీద ఎర్రటికుంకుమబొట్టు స్పష్టంగా కనబడింది సత్య వాదికి. అంతకు ముసుపెన్నడూ అది అంత ప్రత్యేకంగా అతని కంటపడ లేదు.

"టెలిగ్రాం వచ్చింది ఆయన దగ్గరనుంచి" ఆగి కొద్దిగా సిగ్గుగా చెప్పింది- "గ్రీటింగ్ పంపారు నాకు, పిల్లలకి."

టెలిఫోన్ మీద గ్రీటింగ్ డిక్టేట్ చేసి, ఫోన్ గ్రీటింగ్ ఇచ్చి ప్లేంట్లోకి వెళ్ళిన కొన్ని గంటల్లో ఆ ఏక్సిడెంట్ జరిగి ఉండాలి.

గొంతు సర్దుకున్నాడు. సత్యవాది ఏదో చెబుతున్నాడని గ్రహించి, అతని వంక చూసింది సుందరరావు భార్య. "మీకు చిన్న కానుక తెద్దామను కున్నాను కాని కుదరలేదు...."

"పర్వాలేదండీ. చిన్న పండగేగా!"

ఈ వార్త ఎలాగూ తెలుస్తుంది.

ఒక్క రోజు ఆగితే, తను చెప్పకుండావుంటే ఈ పండగ సంతో షాన్ని వాళ్ళనుంచి తను దూరం చేసినవాడవడు.

ఈ శోకాన్ని ఇవాళ బదులు రేపే అందచేస్తే ఏం?

జీవితాంతం ఈవిడ దుఃఖాన్ని, ఆయన పోయిన వెలితిని భరించక తప్పదు. కాని వాటిని ఇంకోరోజుకి తనెందుకు పెంచడం?

"ఏమిటి?" అడిగిందావిడ సత్యవాది మొహంలోని భావాలని చదివి.

"ఏంలేదు. రాత్రి రేడియో వినండి."

అయిదు నిమిషాల్లో బయటకు నడిచాడు సత్యవాది.

"....నించి రాధ, దుర్గ, ఖైరతాబాద్‌నించి మిష్టర్ అండ్ మిసెస్ సుందరరావు, వనజ, రమేష్ కోరిన పాట ఇది."

మధ్యలో ఎడ్వర్‌టైజ్‌మెంట్ షార్ట్ లేకుండా మొదలైంది- బడి పంతులు సుశీల పాడిన ఆ పాట.

"మీ నగుమోము నా కనులారా
కడదాకా కననిండు
....సూత్రముతో....
....కడతేరి పోనిండు"

( విపుల )

కథా నిలయం
2270
శ్రీకాకుళం